# వెన్నెల జల్లులు

భమిడిపాటి జగన్నాథరావు



లేవాలంటే బద్ధకంగా ఉంది. చలిగా ఉంది. అయినా లేవక తప్పదు. ఇంటిల్లిపాదీ ఎప్పుడో లేచి పోయి వుంటారు. అమ్మ ఐదు గంటలకే లేచి ఆవుపాలు తీసి–కాఫీలు కాచేసి, వేడివేడి ఇడ్లీలు చేసేస్తుంది.

నాన్నగారు ఆరు గంటలకల్లా స్నానం,కాఫీలయిపోయి తెల్లటి బట్టల్లో విరిసిన పువ్వులా రెడీ అయిపోయి ఉంటారు.

వీళ్ళకు రోజూ ఇవే పనులు వేళ తప్పకుండా చెయ్యడానికి విసుగు ఎలా కలగదో?

ఆలోచనల్లోంచి, పక్కమీంచి లేవక తప్పలేదు. మళ్ళీ మొదలు ఒకటొకటీ– మొహమూ, స్నానమూ, భోజనమూ ఇదే క్రమం. 'పరస్పర ప్రతిద్వంద్విత ముగ్గ' అన్నట్టు.

అదే బ్రష్‌మీద అదే పేస్టు వేసుకుని, అదే చెంబుతో అదే గోలెంలో నీళ్ళు ముంచుకుని,

వెరైటీ కోసం చోటుమాత్రం రోజుకో చోటు మారుస్తూ-

బద్ధకంగా మొహం కడుగుతున్నాను.

మా ఇంట్లో చిట్టచివర పూసిన ముద్ద నందివర్ధనం ఫ్రెష్‌గా వేడివేడి నీళ్ళు స్నానం చేసేస్తోంది— వంటిమీంచి నీళ్ళు పొగలు- నవ్వు సువాసనతో.

"ఏయ్! ఇప్పుడా లేవడం? నీకు ఇడ్లీలు లేవు తెలుసా?" అంటూ నాలుగు నీళ్ళ చుక్కలు నా మీద చిలకరింపు. చలిగా, చల్లగా, హాయిగా.


"పోవోయ్"

"పోతున్నా"

తడిసిన డ్రాయర్లోంచి ఆ రేకు నందివర్ధనం చకచక పొడి తువ్వాల్లోకి మారింది. ఒక తెల్లగులాబీని ఎంచి కోసింది-రోజూ లాగానే. అలాగే తీసుకువెళ్ళి తులసి కోటలో మొక్కమీద ఉంచి, కళ్లుమూసి పెదవులు కదుపుతోంది -రోజూలాగానే.

"ఎవరినే తిడుతున్నావ్?" - నాదీ రొటీన్‌జోకే-అలా జోక్ చేస్తూనే అనుకుంటాను రోజూ.

ఇంత హాయిగా స్నానం చేయడం, ఇలా ఈ పని, ఇవన్నీ ఎవరు నేర్పేరు దీనికి? ఒకవేళ నేర్పినా 'పనులే' చేయాలి గానీ, ఆ పనుల వెనుక ప్రతిరోజూ ఇంత హాయి ఎలా కలుగుతోంది ఈ చిన్న ముండకి?



మొహం కడగడం పూర్తి చేసి అలవాటుగా పెరట్లోని మొక్కలన్నీ పరీక్షిస్తూ, పువ్వులు చూసుకుంటూ కంచి వారకి వెళ్ళాను.

కంచి అవతల ఇంటి పెరట్లో మణి తోమిన గిన్నెలన్నీ శుభ్రంగా కడుగుతోంది. చిన్న గిన్నెడు నీళ్ళతో ఎంతో పొందికగా, ఒబ్బిడిగా, ఆ కడిగిన గిన్నెలన్నీ అలికిన ఆచిన్ని అరుగుమీది తెల్లటి ముగ్గులమీద బోర్లిస్తోంది.

పేడనీళ్లు చల్లిన వాకిలి. ముగ్గులు. స్నానాలు చేసిన వాళ్ళ పిల్లలిద్దరూ తెల్లటి బట్టల్లో పావురాల్లా ఆడుకుంటున్నారు.

రోజూ ఇవే పనులు. మణి ఒక్కతే వీటితో సతమతమౌతూ-

విసుగురాదా?

నాకు మాత్రం ఆ కంచెలోంచి కనబడే ఆ పక్కఇంటి దినచర్య చాలా ఇష్టంగా ఉంటుంది.

జర్మన్ సిల్వర్ గిన్నెలో కాచినకాఫీ గాజుగ్లాసులో పోసి- అతన్ని పిలిచి ఇస్తోంది మణి.

నాకు రోజూ-ఆ కాఫీలో ఏదో గమ్మత్తయిన రుచి ఉందని అనిపిస్తూ ఉంది. అడిగితా గాలని చిన్న మొహమాటంతో కూడిన కోరిక.

అమ్మ పిలుపుతో ఇంట్లోకి వచ్చాను.

పేపరుచూస్తూ అమ్మ అందించినకాఫీ నాలుగు గుక్కల్లో తాగి గ్లాస్ అక్కడే పారేసి వీధిలోకి వచ్చేశాను.

* * *

పగలంతా కావలసినంత ఖాళీ. ఏమీ తోచదు. పనిలేనట్టో,ఉన్నట్టో తేల్చుకోలేను.

'సెలవులు ఇంత హారిబుల్' అని సెలవుల్లోనే అనిపిస్తుంది.

ఇలాంటి శీతాకాలపు మధ్యాహ్నాల్లో వెచ్చటి ఎండా నీడలమధ్య రోజూమధ్యాహ్నం భోజనంచేసి ఆఫీస్‌కు వెళ్తూ- దారి అంతా పరిశీలించేవాణ్ణి.

# వేలాడుతున్న మనిషి

దినం వేలాడుతోంది ఆకాశంలో
దినంతో వేలాడుతున్నాడు మనిషి !
మనిషి
నా పద్యంలోకి వచ్చి ఇరుక్కున్న
ఒక తుఫాను
జీవిత అఖాతంలో ఇరుక్కున్న ఒక
సముద్రం నేను
దుకాణాలు కళ్ళు మూసుకున్న
ఆదివారాన్ని కానే కాను ...
ఒరే నీ గిటారు వాద్యం చాలించు
ఆ పచ్చటి సీసాల్లో పడుకుని నిద్రిస్తున్న
ద్రవరూప సూర్యుడ్ని
ఈ గొంతు లోయల్లోకి స్రవించనీ
ఈ క్షణిక పాత్రలోకి జలపాతంలా
దూకనీ
అంతర్లోకాల కాంతి దాహాన్ని తీర్చనీ
నిద్రిస్తున్న ప్రతీకల్ని బింబాల్ని అలంకారాల్ని



మొఱుగుతూ వీధుల్లోకి పరుగెత్తనీ
అప్పుడు-
చీకటి సుడిగుండాలతో నిండిన
ఈ రాత్రి చేతిలోనే ఆ కిటికీ
మారిపోతుంది
గెలక్సీలు నర్తిస్తున్న విశ్వంగా !
కొండలు దిగివస్తాయి సెలయేళ్ళు
కొడవళ్ళు పట్టుకుంటారు పాలేర్లు
అకస్మాత్తుగా కురుస్తాయి ఆకాశాలు
గట్టున ఆరుతున్న గుడ్డల్ని కాలువలు
మోసుకు పోతాయి
పులుస్టాపుల్ని ఢీ కొంటాయి ప్రశ్నలు
పర్వతాల్ని దాటుతాయి ఫైటర్ విమానాలు
కొడవలి నౌక ఎక్కి కోట్లాది నక్షత్రాలు
చేరతాను నేను
ఒక బాలుడ్నయి....

—శేషేంద్ర

అటూ, ఇటూ పాకలు. ఆ పాకల్లో అరుగులమీంచి వాకిట్లోకి మంచాలు వాల్చుకుని కాళ్లకు ఎండ తగిలేలా పడుకునే వాళ్లూ, తీరిగ్గా కూచునేవాళ్లూ, రేడియోలు ఆన్ చేసుకుని పాటలు వింటూ శీతాకాలపు చలిలోంచి సుఖాన్ని అనుభవించేవాళ్లూ—

వాళ్లని చూస్తే భలేఅసూయగాఉండేది. ఎంత విశ్రాంతి వీళ్లకి!-అని.

నేను ఈ ఎండలో ఈ టైంలో ఈ ఆనందంఏమీలేకుండా ఇలాసైకిల్‌తొక్కుకుంటూ పోయి ఆఫీస్‌లో పడిపోవాలి కదా!

వాళ్ళ ఆ లెషర్‌నీ, ఆ సౌఖ్యాన్నీ నేను మనసులోనే అనుభవిస్తూ వెళ్ళిపోయేవాణ్ణి.

ఇప్పుడు నాకు అదే లెషర్, అవే చలికాలపు మధ్యాహ్నాలు. పడుకుంటే బద్ధకం, పుస్తకం చదవాలంటే విసుగు. టైం కిల్ కాదు.

ఆ రోజుల్లో సెలవులకోసం. ఆ లెషర్‌లోని సౌఖ్యానుభవంకోసం పడిన ఆరాటం తాలూకు ఉద్వేగం ఏమీ కలగడంలేదు.

ఇప్పుడు ఏమైపోయిందది ?

* * *

సన్నగా తెరజార్చినట్టు సంధ్య. దట్టంగా అలుముకుంటూన్న చలి.

పెరట్లో నీళ్ళపొయ్యిలోంచి నాలుకలు చాస్తున్న ఎర్రటిమంటలు వెచ్చదనాన్ని మందుతూ.

ఒంటిని చుట్టుకుంటూన్న చలిని విప్పుకుందామని అక్కడకు వెళ్ళాను.

అలవాటుగా, అప్రయత్నంగా కంచిలోంచి నా చూపు.

పొయ్యిమీద కుండలో కాగుతూన్న నీళ్ళు. మరో పొయ్యిమీద మరుగుతూన్న పులుసు ఘుమఘుమ– ఆ వేడివేడి ఘుమఘుమలు చలివంటికి హుషారునిస్తూ.

ఆ కుండలో మరిగే నీళ్ళతో స్నానం చేసి - ఆ వేడిపులుసుతో ఆ పాక ఇంట్లో కిరోసిన్ దీపపు వెలుగులో అన్నం తినాలని బలమైన కోరిక!

ఆనందం, హాయి ఆ ఇంట్లో, ఆ మరిగే నీళ్ళ వేడిలో, ఆ గుడ్డివెలుతురులో ఉన్నాయని నిశ్చయమైన ఊహ.

బద్ధకంగా మధ్యాహ్నపు నిద్రమొహం- ఆ మొహాన్ని ఈ కాగునిండా మరుగుతున్న నీళ్ళలో చెంబుడు నీళ్ళు చాలు - మామూలుగా చేయడానికి.


ఆ చిన్న పనికే నాకు విసుగ్గా ఉంటుంది.' రోజూచేసేపనేగా! మానేస్తే నేం ? ఇవేళటికి'

అతను - ఆ మణి మొగుడు - గోచీ పెట్టుకొని అనుతుంబతో కుండలో నీళ్ళు ముంచుకుని స్నానంచేస్తున్నాడు - మసక వెన్నెల అతని తడి వంటిమీద పడి మెరుస్తోంది.

వీళ్ళందరికీ విసుగులేదా ? ఇలా వీళ్ళందరూచేసుకునేపనులునాకుహాయిగా అనిపిస్తాయి ఎందుకు? జీవితానందం అంతా ఇంత స్పష్టంగా వీళ్ళ అనుభవాల్లోంచి నన్ను తాకుతుంది - కానీ నాకు నా జీవితంలో ప్రతి అనుభవమూ ఇంత విసుగ్గా ఎందుకుంటుంది ?

* * *

పరధ్యానంగా సైకిల్‌తొక్కుతున్నాను. సన్నటి వెడల్పురోడ్డు. రోడ్డంతా నాదే-



నేనే-అయి తొక్కుతున్నాను. రోడ్డంతా పరుచుకున్న వెన్నెల. చెట్ల క్రింద వెన్నెల ముగ్గులు. గాలికి చెట్లు కదుల్తూ-రోడ్డుమీద చెట్ల నీడలు కదుల్తూ -

గొప్పభావోద్వేగంతో - నేనూ కదిలిపోతూ-

రోడ్డుమీద వెన్నెల-వెన్నెలమధ్యచెట్లు. చెట్లమీద వెన్నెల్లో? మరి -? అనుకుంటూ పైకిచూశాను.

అలా చూస్తుంటే కొద్దిదూరంలో-

అరె! విరగబూసిన పున్నాగ చెట్టు.

ఆశ్చర్యంలో ఉండిపోయాను.

ఈ రోడ్లో నాకు తెలీకుండా పున్నాగ పూలచెట్టా? ఇదెలా! అనుకుంటూ సైకిల్ గబగబా తొక్కేను.

ఇంకా ఆశ్చర్యం. అది నేను రోజూ చూసే వేపచెట్టే. వెన్నెలని పూసేసి — పున్నాగ పూల గుత్తులుగా నన్ను మోహపెట్టింది.

క్షణంలో-ఎంత గొప్ప థ్రిల్!

జీవితంలో విలువలు తెలుసుకోవడం, నిర్ణయించుకోగలగడం ఇంత కష్టమా?

*　　*　　*　　*

అవును.

మొదటి సారిగా నాకు 'వెన్నెలే' చెప్పింది ఆ సంగతులన్నీ—చుట్టూ ఉన్న ప్రపంచం రసవత్తరంగానూ, నా నిత్య జీవితానుభవం నాకు విసుగ్గా ఉండడానికి కారణం కూడా.

వెన్నెల పేరు వెన్నెల కాదు.

కాని నేను ఆ పేరే పెట్టుకున్నాను.

మొదటి గొప్ప థ్రిల్‌లోంచి విలువలు తెలుసుకోవడం నేర్పిన వెన్నెల్లోనే ఆమె నన్ను కలిసింది. ఆమె కలయిక ఆనాటినుంచి ఈనాటిదాకా అదే లోకంలో ఉంచింది నన్ను.

అప్పటినుంచి ఆమె పేరు వెన్నెలే.

మొదటి సారి ఆమె ఇంట్లో తనదైన చిన్నిగదిలో పాటపాడమని అడిగాను.

బెట్టు సగులు-బ్రతిమిలాటలు....ఎలా వుంటాయో? ఏమో?

పాట పాడింది.

'మోహనరాగమహా! మూర్తివంత మాయె! అని-పాడి...." ఈ పాట నాకు చాలా ఇష్టం. కాని ఎప్పుడూ ఎక్కడా పాడలేదు. ఇంత అర్ధవంతంగా వున్న చోటే పాడాలని అలా ఉండిపోయాను-" అంది.

పాటలు పాటలుగానే విని ఆనందించడం మాత్రమే తెలుసు నాకు.

ఇప్పుడెలా? ఇలాటి మాటలతో కలుపుకుని పాటవిన్న ఈ అనుభవాన్ని నాలో ఎలా ఇముడ్చుకోను-?

ఆలా మొదలయింది నాకు వెన్నెలతో, వెన్నెల్లో జీవితకాలం గడపడం.

విరజాజులు ఎంతో ఇష్టం తనకి. రోజూ మధ్యాహ్నం నుంచే సాయంత్రం కోసం ఎదురుచూసేవాణ్ణి. ఎంతో ఇష్టంగా ఆ మొగ్గలన్నీ కోసి గాజుగిన్నెలో సర్ది ఉంచేవాణ్ణి. పట్టరాని ఉద్వేగం నిముషం గడిచే కొద్దీ. వేడినీళ్ళస్నానం, సోప్ పరిమళాలతో, తెల్లని పంచె, లాల్చీతో అరవిచ్చిన జాజులతో, ఆ ఇంటి మెట్లు ఎక్కేవాణ్ణి.

నా ఎదుటే కూచుని ఆ పూలు అన్నీ మాలకట్టేది. అలా క్షణక్షణానికి పెరుగుతున్న పూలమాల, ఆ మాల మీంచి చురుగ్గా కదుల్తూన్న చేతివేళ్లు. వేళ్ళ చివర సగం సగం మిగిలిన గోరింటాకురంగుతో గోళ్ళు. గోళ్ళ మొదళ్ళలో తెల్లని చంద్రవంకలు.

తల ఎత్తి, నన్ను పరిశీలించి "నువ్వు గొప్ప భావుకుడివోయ్" అని చిరునవ్వు నవ్వేది

ఉద్వేగంతో ఊగిపోయాను. ఆనందంతో తేలి తూలిక అయిపోయాను.

తెల్లవారి లేచింది మొదలు ఏ పని చేస్తున్నా మనసంతా తనే నిండి-

ప్రతి పనీ శ్రద్ధగా, ఆసక్తిగా-

నేను-నాకే-ఆశ్చర్యంగా

ఆఖరికి షేవ్ చేసుకోవడం, టైట్‌గా పౌడరు అద్దుకోవడం, ఇవన్నీకూడా ప్రతిరోజూ కొత్తగా, ఇష్టంగా చేసుకోవాలనిపించే ఈనా మనసేమిటో-నాకే అర్థం కాకుండా పోయింది.

జీవితంలో ప్రతి అనుభవానికి ఇంత శక్తిని, ఆనందాన్ని ఇచ్చేశక్తి 'థ్రిల్' ఉందా? అని ఆశ్చర్యపోయాను.

*　　*　　*

"నేను ఒప్పుకోను" అంది వెన్నెల.

"మరెలా? ఇది నా స్వంత అనుభవమే-" అన్నాను.

"పూర్తిగా ఒప్పుకోను."

నాకు కొంచెం ధైర్యం. కొంతయినా నిజమేకదా! పూర్తిగా ఒప్పించవచ్చనే ధైర్యం.

అలా ఒప్పిస్తే వెన్నెల నాదే అయిపోతుందన్న ఆశ.

కాని చిన్న భయం.

ఈ వెన్నెల నాదే అయిపోతే నా అనుభవాల్లాగే నా వెన్నెల కూడా సారహీనంగా, విసుగ్గా అయిపోదుకదా నాకు?


ఈ భయం చిన్నది కాదు-పెద్దదే.

కాని ఓ మూలకి నెట్టి తొక్కేశాను.

నేను ఒక్కణ్ణే తెలివైనవాడినని ఎంత మౌఢ్యం నాకు??

నా ఈ భయాన్ని వెన్నెల స్పష్టంగా చెప్పింది. వాచ్యం చేసి-అయినా వ్యంగ్య ధోరణిలో చెప్పింది.

అనాడు-




తెల్లని చీరతో, విరజాజులు పూసిన జడతో, నా ఒడిలో పడుకుని నా తలను తన మీదకులాక్కొని నా నుదుట పెదవులతో అద్దింది.

ఆ అనుభవాన్ని మాటలతో ఎలా చెప్పను ?

నాలాంటి భావుకులు అందరికీ ఇంత అపురూపమైన ప్రేయసితో ఇంత గొప్ప అనుభవమూ కలుగుగాక.

నా ఆనందంలో నేను వుండగానే అంది. "చూడు! మనం కలిసి బతకడం మొదలుపెడతాం. రోజులు గడుస్తాయి. పిల్లలు పుడతారు. కొన్నాళ్ళ తరువాత వంటింటిలో వంట చేస్తున్న నేను- ఏవో పాత జ్ఞాపకాలు కదిలి ఆ నలిగిన నేత చీరతో గబుక్కున నీ దగ్గరకు వచ్చి— నువు అప్పుడుఆఫీసుకు వెళ్ళేహడావిడిలో వుంటావు-చటుక్కున ఇలాగే ముద్దుపెట్టుకుంటాను.

ఇలాగే ఉంటుందా ? నీకు అప్పుడు ? ఆలోచించి నిజాయితీగా చెప్పు."

నేను అవాక్కయిపోయాను. నా భయాన్ని ఇంత సూటిగా, అయినా ఇంత అందంగా, ఇంత స్పష్టంగా ఎలా చెప్పేసింది?

దీనికి సమాధానమా ?

"నువ్వు నాకు జవాబు చెప్పవద్దులే. నాకే తెలుసు" అంది.

చటుక్కున తన చేతులు పట్టుకుని ఆ మెత్తని అరిచేతులలో ముఖాన్ని దాచుకున్నాను.


"ఎలా ? ఎలా ?" అన్నాను సన్నని మూలుగుతో.

నెమ్మదిగా తన చేతులు విడిపించుకుంది. నా నడుముచుట్టూ చేయి చుట్టి నా ఒడిలో ఓ నిముషం మత్తుగా పడుకుంది. మరు నిముషమే లేచి కూర్చుంది.

భయంగా, దిగులుగా ఆమెకేసి చూస్తున్నాను. పలువరస కాంతుల్లోంచి వెన్నెలలు విరుస్తూండగా సన్నగా నవ్వింది.

ఆ నవ్వుతో ఉత్సాహం పెల్లుబికి జయదేవుణ్ణి అయిపోయాను. "వదసి యది కించిదపి దంతరుచి కౌముదీం" అంటూ.

"ఆగండి. కవి రాజా! మీ కవులూ, భావుకులూ కొంచెం నేలమీద కాళ్ళుఆన్చి నిలబడితే ఎంత బావుణ్ను?" అంది. అని "నా నవ్వును నువు జయదేవుడిలోంచి చూశావు. కాని.... నేనెలాగో చెప్పనా ? వెన్నెల్లో పెరటి కంచెలనిండా అల్లుకున్న బీరపూలు విరిసి మెరుస్తూండగా ఆ చిరు చలిలో స్నానం చేస్తూ 'గూటిలోన దీపముంచి ఏడిసీళ్ళ తానమాడి' అని పాడుకుంటూ నా అనుభవంలోని హాయిలోంచి కవిత్వాన్ని పలికించుకుంటాను.



అందుచేత జీవితానుభవం సారవంతం కావడానికి-నేను-అంటే స్త్రీ కూడా పూర్తి కారణం కాదు. ఒక్కమాట చెప్తాను- మీ కవులూ, భావుకులూ కొంచెం ప్రయత్నించి సాధించవలసినది" అని ఆగింది.

"ఊ! చెప్పవూ త్వరగా."

"అది త్వరగా జరిగేది కాదు నాన్నా! రోజూ మీ నిత్యజీవితంలోంచి మీరు భావిస్తున్న రొటీన్ మీ మనసుకు అసలు పట్టదు. ఇలా మీరు రోజూ రోజూ మీ స్వంత జీవితాన్ని మనసుతో అనుభవించరు. మీ మనసు ఎక్కడో వుంటుంది. శరీరం మాత్రం యాంత్రికంగా పనులు చేస్తుంది. దాంతో మనసుకు చెందని ఈ అనుభవాలు అన్నీ సారహీనంగానూ, విసుగ్గానూ ఉండవూ మరి!?"

"కాస్త వివరంగా చెప్పవూ ?" నాకు కంగారుగా సగం, సగం అర్థమవుతూన్నట్టుగా వుంది.

"మామూలు మనుషులు ప్రాక్టికల్ లైఫ్‌ని ప్రాక్టికల్‌గానే పొందుతారు. అనుభూతిని గురించి ఆలోచన, రొటీన్‌లోని చికాకు వాళ్ళని తాకదు. వాళ్ళకు ఆనందం కంటే సుఖమే ఎక్కువగా తెలుస్తుంది. కానితమరిలాంటి మహానుభావులుమాత్రం ప్రతీ అనుభవాన్నీ మనసుతో పొందే ప్రయత్నం చేస్తే తప్ప ఈ ప్రపంచంలో నిత్యజీవితానందం పొందలేరు. మీ భావుకత మీలో జీర్ణం కావాలి.

నీ చుట్టూ ప్రపంచాన్ని నువ్వు నీ హృదయంతో అనుభవిస్తున్నావు కాని-నీ దగ్గరకు వచ్చేసరికి పున్నాగ పూల చెట్టు వేపచెట్టు అయిపోతోంది" అని గలగలా నవ్వింది.

నాకు ఇప్పుడు చాలా స్పష్టంగా తెలిసింది. నిజమే. ఎంతసున్నితమైన విషయం. నా జీవితంలో ఆనందాన్ని నేనే మధించి, సాధించి పొందాలని.... నాకు ఎంత వివరంగా పూవు సహజంగా విరిసినట్టు నాకే తెలిసేలా చెప్పింది !!

అందుకే ఆమె ఎప్పటికీ నాకు ఆరాధ్య.